హైదరాబాద్
3-8-2023
సంపుటి:08
సంచిక: 333
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



2లో

## రేపటి నుంచి ఎంసెట్ తుది కౌన్సెలింగ్

**భర్తీకానున్న12వేలకు పైగా సీట్లు**

9న తుది విడత సీట్ల కేటాయింపు

స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటా సీట్లను నింపేందుకు వెబ్ ఆప్షన్లు

17 నుంచి ప్రత్యేక విడత కౌన్సెలింగ్

23న స్పాట్ అడ్మిషన్లకు మార్గదర్శకాలు విడుదల

## మణిపూర్‌పై అదే పట్టు

**లోక్‌సభలో బీఆర్ఎస్ వాయిదా తీర్మానం**

**వెంటనే చర్చించాలని ఆందోళన**

**మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలి**



న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై చర్చించాల్సిందేనని బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మణిపూర్ హింసాకాండంపై చర్చించాలని కోరుతూ బుధవారం లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. సభ ప్రారంభం కాగానే మణిపూర్ అంశంపై అత్యవసరంగా చర్చించాలని బీఆర్ఎస్ ఎంపీలు పట్టుబట్టారు. బీఆర్ఎస్ సభ్యుల ఆందోళనతో స్పీకర్ లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు.మహిళా బిల్లుపై తీర్మానంచట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని

2లో



## సుప్రీంకోర్టులో రాహుల్ అఫిడవిట్

న్యూఢిల్లీ: మోదీ ఇంటిపేరు వ్యాఖ్యలపై పరువునష్టం కేసులో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సుప్రీంకోర్టు లో బుధవారంనాడు రిజాయిండర్ అఫిడవిట్ దాఖలు చేశారు. 63 పేజీల అఫిడివెట్‌లో రాహుల్.. ఈ కేసు 'అసాధారణమైన కేటగిరి' కిందకు రాదని, తనకు విధించిన రెండేళ్ల శిక్షపై స్టే విధించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. తాను శిక్షార్హమైన ఎలాంటి నేరానికి పాల్పడలేదని,



## పులివెందుల పొలికేక!

**జగన్ అడ్డాలో చంద్రబాబుకు నీరాజనం**

**జనంలో తిరుగుబాటు మొదలైంది: బాబు**

**గతంలో ఎన్నడూ లేనంత భారీ స్పందన**

**2 కి.మీ. రోడ్‌షోకు గంటకుపైగా సమయం**

**దారంతా మహిళలు, యువత అభివాదం**

**భయం బద్దలై బహిర్గతమైన అభిమానం**

**బాబు ప్రసంగానికి చేతులెత్తి మరీ స్పందన**

కడప: వైఎస్ జగన్ సొంత అడ్డా పులివెందుల పొలికేక వేసింది. గతంలో కనీవినీ ఎరుగని విధంగా తెలుగుదేశం పార్టీ పట్ల సామాన్య జనంలో ఆదరణ కనిపించింది. 'పులివెందుల బిడ్డ'ను అని చెప్పుకొనే ముఖ్యమంత్రి నాలుగేళ్లుగా సొంత నియోజకవర్గంలోనే బారికేడ్ల మధ్య పర్యటించడమే అక్కడి జనానికి తెలుసు. ఇప్పుడు.. ఓపెన్ టాప్ జీపులో అభివాదం చేసుకుంటూ, జనం మధ్యలోకి వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు

2లో

## అప్పటివరకూ లోక్‌సభకు రాను!

**లోక్‌సభ సజావుగా సాగే వరకు స్పీకర్ స్థానంలో కూర్చోనన్న ఓం బిర్లా**

**సభ్యుల తీరుపై తీవ్ర అసంతృప్తి.. బుధవారం సభకు హాజరవని స్పీకర్**

**%20 నిమిషాలు కూడా సాగని లోక్‌సభ.. పెద్దల సభ నుంచి ప్రతిపక్షాల వాకౌట్**

**ప్రధానిని సభకు రమ్మని ఆదేశించలేను.. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ స్పష్టీకరణ**

2లో

# నేటి నుంచే అసెంబ్లీ

**తొలి రోజు దివంగత సభ్యులకు సంతాపం, బిజినెస్ అడ్వయిజరీ కమిటీ భేటీ**



### నాలుగు రోజుల పాటు కొనసాగనున్న ఉభయసభల సమావేశాలు

హైదరాబాద్: శాసనసభ, శాసనమండలి సమావేశాలు గురువారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతాయి. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశంలో ముందుగా కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్నతో పాటు ఇటీవలి కాలంలో మరణించిన మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం పాటిస్తారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. ఆ తర్వాత స్పీకర్ అధ్యక్షతన జరిగే బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో శాసనసభ సమావేశాల నిర్వహణ తేదీలు, ఎజెండా ఖరారు చేస్తారు.

సుమారు నాలుగురోజుల పాటు శాసనసభ సమావేశాలు జరిగే అవకాశముంది. బీఏసీ భేటీలో విపక్షాల నుంచి వచ్చే సూచనలు, ప్రతిపాదనల ఆధారంగా అవసరమైతే సమావేశాల తేదీలను పొడిగించొచ్చు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే మండలి సమావేశాల్లో తొలిరోజు రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదలపై స్వల్పకాలిక చర్చ జరుగుతుంది. అనంతరం జరిగే బీఏసీ సమావేశంలో మండలి నిర్వహణ తేదీలు, ఎజెండా ఖరారు చేస్తారు.

**చివరి సమావేశాలని...**

తెలంగాణ రెండో శాసనసభకు ఇవి చివరి సమావేశాలుగా భావిస్తున్న నేపథ్యంలో అధికార, విపక్ష పార్టీలు అసెంబ్లీ వేదికగా తమ ఎజెండా వినిపించేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఉచితవిద్యుత్, ధరణి వంటి అంశాలపై స్వల్పకాలిక చర్చ ద్వారా విపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని అధికార బీఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రశ్నోత్తరాలతో పాటు ఇతర చర్చల సందర్భంగా ప్రస్తావించేలా అధికార పక్షం కసరత్తు చేస్తోంది.

మరోవైపు విపక్ష పార్టీలు కూడా డబుల్ బెడ్‌రూమ్‌లు, ధరణి లోపాలు, ఇటీవల వరదల మూలంగా సంభవించిన నష్టం తదితరాలపై చర్చకు పట్టుపట్టే అవకాశాలు ఉన్నాయి. కాగా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరవుతారా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

**4 కీలక బిల్లులు**

ప్రస్తుత సమావేశంలో 4 కీలక బిల్లులు ఉభయ సభల ముందుకు రానున్నాయి. ఇందులో గతంలో అసెంబ్లీ ఆమోదించినా, గవర్నర్ తిరస్కరించిన మూడు బిల్లులు కూడా ఉన్నాయి. వీటిని ఉభయసభలు మరోమారు చర్చించి ఆమోదిస్తాయి.

1. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఇటీవల కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బిల్లు రూపంలో సభలో చర్చించి ఆమోదిస్తారు.
2. తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్‌అన్యూయేషన్) చట్టసవరణ బిల్లు-2022
3. తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టసవరణ బిల్లు-2022
4. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లు-2022



## రుణమాఫీ మళ్లీ షురూ

**గురువారం నుంచే పునఃప్రారంభించాలన్న సీఎం కేసీఆర్..**

**నేటి నుంచే రైతుల ఖాతాల్లో జమ!**

**విడతల వారీగా మొత్తం రూ.19 వేల కోట్లు మాఫీ**

**నెలన్నర రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి**

**రైతాంగ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటన**

**రైతు సాధికారత సాధించే వరకు విశ్రమించబోమని స్పష్టీకరణ**

**29.61లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి**

హైదరాబాద్: రైతు రుణమాఫీని తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను గురువారం నుంచే పునఃప్రారంభించాలని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే

2లో

## సాంపాదకీయం

# పల్లె ప్రగతి సరే, పంచాయతీ కార్మికుల మాటేమిటి?

దేశంలో ఎక్కడా లేనట్లుగా, గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం 'పల్లె ప్రగతి' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు పోతున్నది. కానీ ఆ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రచార పటాటోపమే తప్ప మనుషుల సంక్షేమం ఇమిడి లేదని ఇప్పటికే అనేకసార్లు రుజువైంది. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల గుండె ఘోష, సుదీర్ఘంగా సాగి జూన్ నెలలో ముగిసిన పంచాయతీ జూనియర్ కార్యదర్శుల సమ్మె, ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవటంవల్ల గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేసిన అప్పుల సుడిగుండంలో చిక్కుకుని గ్రామ సర్పంచుల ఆత్మహత్యలు, తాజాగా జూలై 6 నుంచి నిరవధికంగా కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె... ఈ పరిణామాలన్నీ ప్రభుత్వ ప్రచారంలో నిజమెంతో వెల్లడిస్తున్నాయి. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం కాకుండా, 2023 జనాభా ప్రాతిపదికన, పెరిగిన గ్రామ పంచాయతీల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలనీ తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్న కార్మికులను పర్మినెంటు చేయాలనీ గ్రామ పంచాయతీలలో అమలు చేస్తున్న 'మల్టీ పర్పస్ వర్కర్స్ సిస్టం'ను ఉపసంహరించుకోవాలనీ సమాన పనికి సమాన వేతనం, కార్మికులకు ఉద్యోగులకు ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలని కోరుతున్నారు కార్మికులు. ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు, పండుగ సెలవులు లాంటి చట్టబద్ధ హక్కుల కల్పన, విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.10 లక్షల నష్ట పరిహారం కూడా వారి డిమాండ్లలో ఉన్నాయి. అన్ని కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ సమ్మెలో తెలంగాణ రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 60 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొంటున్నారు.

# అప్పటివరకూ లోక్‌సభకు రాను!

న్యూఢిల్లీ: లోక్‌సభలో పది రోజులకు పైగా ఎలాంటి కార్యకలాపాలు జరగకపోవడంపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభలో నెలకొన్న ప్రతిష్టంభనపై ఆయన కలత చెందినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సభా కార్యక్రమాలు స్తంభించిపోవడం పట్ల అధికార, ప్రతిపక్ష సభ్యుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితి చక్కబడితే తప్ప తాను స్పీకర్ కుర్చీలో కూర్చోబోనని ఆయన చెప్పినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సభ ప్రతిష్ఠను నిలబెట్టాలనే స్పీకర్ ఎప్పుడూ ఆశిస్తారని, ప్రజా ప్రతినిధులు హుందాగా వ్యవహరించాలని భావిస్తారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. సభ్యులు సభా గౌరవాన్ని కాపాడేంత వరకు తాను స్పీకర్ స్థానంలో కూర్చునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. స్పీకర్ ఓం బిర్లా బుధవారం లోక్‌సభకు రాకపోవడంతో ప్యానెల్ స్పీకర్, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నోత్తరాల సమయాన్ని నిర్వహించేందుకు ప్రయత్నించారు. కానీ, సభ ప్రారంభం కాగానే ప్రధాని మోదీ మణిపూర్‌పై ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్, డీఎంకే సభ్యుడు రాజాతో పాటు ఇండియా కూటమికి చెందిన విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. దీంతో కేవలం 16 నిమిషాల్లోనే ఆయన సభను మ?ధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఇక 2 గంటలకు లోక్‌సభను మరో ప్యానెల్ స్పీకర్, బీజేపీ ఎంపీ కిరీట్ సోమయ్య నిర్వహించేందుకు యత్నించగా.. పరిస్థితిలో మార్పు లేకపోవడంతో 4 నిమిషాల్లోనే సభను గురువారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నట్లుగా 267 నిబంధన కింద తాను మణిపూర్‌పై చర్చకు అనుమతించే ప్రసక్తే లేదని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తేల్చిచెప్పారు. అలాగే ప్రధానమంత్రిని సభకు వచ్చి మణిపూర్‌పై ప్రకటన చేయమని ఆదేశించే అధికారాలు లేవని, రాజ్యాంగం అలా నిర్దేశించలేదని ఆయన తెలిపారు. సభ మణిపూర్‌పై చర్చను ప్రారంభించాలని ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌ను తోసిపుచ్చడంతో ఇండియా కూటమి ఎంపీలంతా వాకౌట్ చేశారు. అదేసమయంలో రాజ్యసభలో అటవీ సంరక్షణ బిల్లు, గనులు, ఖనిజ వనరుల అభివృద్ధి బిల్లులను ఆమోదించారు.

# రుణమాఫీ మళ్లీ షురూ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఎన్ని కష్టాలొచ్చినా రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తిరిగి చక్కబడిన నేపథ్యంలో, రాష్ట్రంలోని రైతుల పంట రుణాల మాఫీ కార్యక్రమాన్ని పునః ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఇచ్చిన మాట ప్రకారం, రైతు రుణమాఫీ కార్యక్రమం కొనసాగించాం. అయితే కేంద్రం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం, కరోనా వల్ల సంభవించిన ఆర్థిక సమస్యలు, ఎఫ్ఆర్‌బీఎం నిధులను విడుదల చేయకుండా కేంద్రం రాష్ట్రం పట్ల అనుసరించిన కక్షపూరిత వైఖరి తదితర కారణాల వల్ల ఏర్పడిన ఆర్థిక లోటుతో.. రుణ మాఫీ ఇన్నాళ్లూ కొంత ఆలస్యమైంది. కానీ రైతులకు అందించాల్సిన రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కొనసాగిస్తూనే వస్తోంది. మేం ఇప్పటికే చెప్పినట్టు ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా, ఆరునూరైనా రైతుల సంక్షేమాన్ని, వ్యవసాయాభివృద్ధి కార్యాచరణను విస్మరించే ప్రసక్తేలేదు. పైగా వ్యవసాయాభివృద్ధి కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి ఆదర్శవంతమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నాం. రైతు సాధికారత సాధించే వరకు, రైతులను ఆర్థికంగా ఉన్నతంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించే ప్రసక్తేలేదు..'అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే అందించిన రుణమాఫీ పోను మరో రూ.19 వేల కోట్ల రుణమాఫీని రైతులకు అందించాల్సి ఉందని తెలిపారు. లక్షలోపు పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తోంది. ఇప్పటివరకు రూ.36 వేల వరకు బకాయిలను మాత్రమే ప్రభుత్వం విడుదల చేయగా.. ఇప్పుడు మిగిలిన వారికీ మాఫీ సొమ్మును ప్రభుత్వం అందజేయనుంది. అయితే చాలామంది రైతుల నుంచి రైతుబంధు సొమ్మును బ్యాంకులు రుణమాఫీ కింద తీసుకున్నాయి. మరోవైపు కొత్త రుణం పొందాలంటే రెన్యువల్ చేయాల్సి ఉంటుంది కాబట్టి రైతులు బకాయిలు చెల్లించినట్టైతే తర్వాత రుణమాఫీ సొమ్మును వారి ఖాతాల్లో వేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కొందరు రైతులు సొంతగా బ్యాంకులకు చెల్లింపులు చేశారు. కొందరు మాత్రం చెల్లించలేకపోయారు. దీంతో లక్షలాది మంది రైతులు డిఫాల్టర్లుగా మారినట్లు అంచనా. కాగా కొత్త రుణాల రెన్యువల్ కోసం బ్యాంకులకు రుణం చెల్లించిన రైతులకు సైతం ఇప్పుడు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. గతంలో ప్రభుత్వం ప్రకటించిన రైతుల జాబితా ప్రకారమే సొమ్మును వారివారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం మరోసారి స్పష్టత ఇవ్వాల్సి ఉందని అధికారులు అంటున్నారు. రూ.19 వేల కోట్ల చెల్లింపుతో రూపాయి కూడా మిగలకుండా తెలంగాణలో సంపూర్ణ 'రైతు రుణమాఫీ'కార్యక్రమం పూర్తి కానుందని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మొత్తం 42 లక్షల ఖాతాలకు సంబంధించి రుణమాఫీ జరగనుంది. తద్వారా 29.61 లక్షల రైతు కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. రైతుబంధు తరహాలో విడతల వారీగా కొనసాగిస్తూ నెలా పదిహేను రోజుల్లో, సెప్టెంబర్ రెండో వారం వరకు రైతు రుణమాఫీ కార్యక్రమం మొత్తం పూర్తి చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమాన్ని గురువారం నుంచే పునఃప్రారంభించాలని ఆర్థిక మంత్రి హరీశ్‌రావును, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కేసీఆర్ ఆదేశించారు. దీంతో ఆగస్టు 3వ తేదీ నుంచే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి.

# రేపటి నుంచి ఎంసెట్ తుది కౌన్సెలింగ్

హైదరాబాద్: ఎంసెట్ ఇంజినీరింగ్ తుది విడత వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల 4న ప్రారంభంకానున్నది. శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు, స్లాట్‌బుకింగ్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు. 9న సీట్లు కేటాయిస్తారు. దీంతోపాటు స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కూడా బుధవారం అధికారులు విడుదల చేశారు. 17 నుంచి ఈ కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తారు. రెండో విడత కౌన్సెలింగ్ ముగిశాక బీటెక్ కోర్సుల్లో మొత్తం 12,013 సీట్లు మిగిలాయి. సీఎస్ఈ, ఐటీ అనుబంధ కోర్సుల్లో 3,137, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కోర్సుల్లో 3,805, మెకానికల్, సివిల్ కోర్సుల్లో 4,592, ఇతర ఇంజినీరింగ్ కోర్సుల్లో 479 చొప్పున సీట్లున్నాయి. వీటితోపాటు ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయని పక్షంలో మరికొన్ని సీట్లు మిగులుతాయి. ఈ మొత్తం సీట్లను తుది విడత కౌన్సెలింగ్‌లో భర్తీచేస్తారు. ఈ కౌన్సెలింగ్ ముగిశాక 23న స్పాట్ ప్రవేశాల కౌన్సెలింగ్ మార్గదర్శకాలను విడుదల చేస్తారు. ఇక తుదివిడత కౌన్సెలింగ్‌లో స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటా సీట్లను కూడా భర్తీచేయనున్నారు. ఈ కోటా విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలని అధికారులు సూచించారు.

ఇంజినీరింగ్ సీట్లను ఏటా మూడు విడతల్లో భర్తీచేస్తారు. విద్యార్థుల నుంచి వచ్చే అభ్యర్థనలను బట్టి స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. గతంలో కాలేజీల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయకముందే స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ నిర్వహించేవారు. ఇప్పుడు సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్ట్ చేసిన తర్వాత మరో విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించడం, ఈ విడతలో సీట్లు పొందిన వారు మళ్లీ రిపోర్ట్‌చేయడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొంటున్నారు.

# మణిపూర్‌పై అదే పట్టు

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎంపీ మాలోతు కవిత లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. మహిళల రిజర్వేషన్ల బిల్లు వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిందని గుర్తు చేశారు. వస్త్ర పరిశ్రమకు సంబంధించి కేంద్రం అమలుచేస్తున్న వివిధ పథకాలకు నిధుల కేటాయింపు రాష్ట్రాలు, జిల్లాల వారీగా ఉండదని కేంద్ర జౌళి శాఖ సహాయమంత్రి దర్శనా జర్దోశ్ పేర్కొన్నారు. తెలంగాణలో వస్త్ర పరిశ్రమకు కేంద్రం విడుదల చేసిన నిధులు, అమలవుతున్న పథకాల వివరాలు ఇవ్వాలని పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు వెంకటేష్ నేత, జీ రంజిత్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి, జిల్లాలకు ఏ మేరకు నిధులు కేటాయించామనే వివరాలు లేవన్నారు.

మణిపూర్ అంశంపై చర్చకు కేంద్రం అంగీకరించకపోవడంతో నిరసనగా విపక్షాలు రాజ్యసభలో వాకౌట్ చేశాయి. ప్రభుత్వం అటవీ సంరక్షణ(సవరణ) బిల్లు, జన్‌విశ్వాస్ బిల్లు, మైన్స్, మినరల్స్ సవరణ బిల్లులను కేంద్రం ఆమోదించుకొన్నది. మరోవైపు ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతి ముర్మును కలిశారు. మణిపూర్ అంశంపై జోక్యం చేసుకోవాలని, ప్రధాని మోదీ సమాధానమిచ్చేలా సూచన చేయాలని కోరారు.

# సుప్రీంకోర్టులో రాహుల్ అఫిడవిట్

(మొదటి పేజీ తరువాయి)

క్షమాపణే చెప్పాల్సి వస్తే అదే అతిపెద్ద శిక్ష అవుతుందని పేర్కొన్నారు. ఒక వేళ క్షమాపణే అయితే ఈ పాటికే చెప్పేవాడనని అన్నారు. క్షమాపణ చెప్పడానికి నిరాకరించినందునే పిటిషన్ పూర్ణేష్ మోదీ తనను 'అహంకారి'గా పేర్కొన్నట్టు రాహుల్ తన అఫిడవిట్‌తో తెలిపారు. తాను ఏ నేరం చేయలేదని, అయినా ప్రజా ప్రాతినిధ్యం చట్టం కింద క్రిమినల్ నేరం మోపి బలవంతంగా క్షమాపణ చెప్పించాలనుకోవడం న్యాయవ్యవస్థను దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. తనకు విధించిన శిక్షపై స్టే ఇవ్వాలని అఫిడవిట్‌లో కోరారు. తద్వారా ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటకలో జరిగిన ఒక ఎన్నికల సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దొంగలందరికీ మోదీ ఇంటి పేరే ఎందుకు ఉంటుందని వ్యాఖ్యానించారు. దీనిపై గుజరాత్ బీజేపీ నేత పూర్ణేష్ మోదీ 2019లో రాహుల్‌పై క్రిమినల్ పరువునష్టం కేసు వేశారు. ఈ కేసులో రాహుల్‌ను సూరత్ కోర్టు దోషిగా నిర్ధారిస్తూ, రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద రాహుల్ వయనాడ్ ఎంపీ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఈ క్రమంలో సూరత్ కోర్టు తీర్పును సుప్రీంకోర్టులో వేసిన తాజా అఫిడవిట్‌లో రాహుల్ సవాలు చేశారు.

# పులివెందుల పొలికేక!

(మొదటి పేజీ తరువాయి)

స్థానికులు జేజేలు పలికారు. సీమ ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చిన ఆయన బుధవారం జమ్మలమడుగు నుంచి బయలుదేరి కొండాపురం నుంచి పులివెందుల నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. సింహాద్రిపురంలో టీడీపీ శ్రేణులు, జనం ఆయనకు భారీఎత్తున స్వాగతం పలికారు. అక్కడి నుంచి అంకాళమ్మ గూడూరు, బలపనూరు మీదుగా ఆయన పులివెందులకు చేరుకున్నారు. ప్రతిచోటా చంద్రబాబు కోస జనం వేచి చూశారు.

### పులివెందులలో కొత్త అధ్యాయం

పులివెందులలో చంద్రబాబు నిర్వహించిన రోడ్‌షోకు జనం బ్రహ్మరథం పట్టారు. మార్కెట్‌యార్డు నుంచి ఓపెన్ టాప్ జీపులో రోడ్‌షో నిర్వహిస్తూ బస్టాండ్ సమీపంలోని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఇంటికొచ్చారు. అక్కడి నుంచి మళ్లీ రోడ్ షో కొనసాగించారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర రోడ్‌షోకు గంటపైనే పట్టింది. దారి పొడవునా మహిళలు, యువత మిద్దెలు ఎక్కి చంద్రబాబు కోసం ఎదురుచూశారు. సింహాద్రిపురం నుంచి పులివెందులలోకి ప్రవేశించే చోట చంద్రబాబు, లోకేశ్ ఫ్లెక్సీలతో పెద్ద ఆర్చి ఏర్పాటు చేశారు. పూలదండలు, బత్తాయి పండ్లతో చంద్రబాబును సత్కరించారు. 'సైకో పోవాలి... సైకిల్ రావాలి' అనే పాటకు హుషారుగా చిందేశారు. పులివెందుల పూలంగళ్ల సర్కిల్‌లో బహిరంగ సభ పెట్టాలని టీడీపీ నేతలు నిర్ణయించుకున్నారు. పోలీసులు అక్కడ అనుమతి ఇవ్వకుండా పాత బస్టాండ్ వద్ద సభ పెట్టుకోవాలన్నారు. చివరకు... పూలంగళ్లకు కూతవేటు దూరంలో సభ జరిగింది. అక్కడి వెంకటేశ్వరస్వామి ఆలయంచుట్టూ జనం కిక్కిరిశారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6గంటలకు బహిరంగ సభ అయిపోవాలి. కానీ రాత్రి 8.20 గంటలకు చంద్రబాబు ప్రసంగం మొదలైంది. ఆయన దాదాపు గంటసేపు మాట్లాడారు. బాబాయ్ హత్యకేసు, కోడికత్తి కేసు, వలంటీర్ల గురించి మాట్లాడాలంటూ చంద్రబాబుకు కార్యకర్తలు, ప్రజలే విజ్ఞప్తి చేయడం గమనార్హం. వివేకా హత్య గురించి మాట్లాడేటపుడు అపూర్వ స్పందన వచ్చింది. వివేకాను హత్య చేసింది ఎవరో అందరికీ తెలుసు... తెలిసిన వాళ్లు చేతులెత్తండి అని చంద్రబాబు పిలుపునిచ్చినప్పుడు భారీఎత్తున పైకిఎత్తారు. పులివెందుల సభ ముగిశాక చంద్రబాబు అనంతపురం జిల్లా పర్యటనకు వెళ్లారు.

### జగన్ పర్యటన గుర్తు తెచ్చుకుని...

పులివెందుల నియోజకవర్గం వైఎస్ కుటుంబాన్ని 40ఏళ్లుగా ఆదరిస్తూ వస్తోంది. ఆ కుటుంబం నుంచే ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. నాడు రాజశేఖర రెడ్డి, నేడు ఆయన తనయుడు జగన్ ముఖ్యమంత్రులయ్యారు. వైఎస్ ఎప్పుడు నియోజకవర్గానికి వచ్చినా పులివెందులలో ఎలాంటి ఆంక్షలు ఉండేవి కావు. జగన్ తీరు ఇందుకు పూర్తి భిన్నం. సొంత గడ్డపైనా ఆయన అతి భారీ బందోబస్తు మధ్య పర్యటిస్తున్నారు. పోలీసులు బారికేడ్లు పెట్టి జనాన్ని కట్టడి చేస్తున్నారు. బుధవారం చంద్రబాబు ఎలాంటి భారీ బందోబస్తు లేకుండానే రోడ్‌షో నిర్వహించారు. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ఉమ్మడి కడప జిల్లాలో ప్రతి ఎకరాకు నీరందిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి'లో భాగంగా బుధవారం జమ్మలమడుగు మండలం కొండాపురం మండలంలో నిలిచిపోయిన గండికోట ఎత్తిపోతల విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సమీపంలోని తిమ్మాపురం క్రాస్ వద్ద సాగునీటి ప్రాజెక్టులపై మీడియాతో, రైతులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. సీఎం చేతకానితనం వల్ల రూ.3556 కోట్లతో చేపట్టిన గండికోట-సీబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ విస్తరణ పనులు 10శాతం కూడా పూర్తి కాలేదన్నారు. ఈ ప్రాజెక్టు బదులు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు చేపట్టి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు.

# 'సంపూర్ణ' ఆరోగ్యం



అమరావతి: ఆరోగ్యవంతమైన భావి తరాల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. డబ్బులకు వెనుకాడుకుండా ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఖర్చు చేస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. డ్రై రేషన్ కింద అందించే సరుకుల నాణ్యతను నిరంతరం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఫౌండేషన్ స్కూళ్లలో చిన్నారుల బోధనపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఆంగ్ల భాషలో పరిజ్ఞానం, ఉచ్చారణ బాగుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి జగన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలివీ.. రక్తహీనత, పౌష్టికాహారలేమి రాష్ట్రంలో పూర్తి తొలగిపోవాలనే లక్ష్యంతో భారీ ఖర్చు గర్భిణిలు, బాలింతలు, చిన్నారుల పౌష్టికాహారం కోసం గత ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.450 -రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా ఇప్పుడు ఏటా సుమారు రూ.2,300 కోట్లు వ్యయం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్ వెల్లడించారు. పౌష్టికాహారాన్ని అందించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ఒక్కొక్కరికీ రూ.850 చొప్పున ఖర్చు చేస్తుండగా సంపూర్ణ పోషణ ప్లస్ కోసం రూ.1,150 చొప్పున వ్యయం చేస్తున్నట్లు చెప్పారు. రక్తహీనత, పౌష్టికాహార లేమి లాంటి సమస్యలు రాష్ట్రంలో పూర్తిగా తొలగిపోవాలన్న లక్ష్యంతో ఇంత ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలన్నీ మంచి ఫలితాలనిచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్లు గ్రామాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా అంగన్‌వాడీలను సందర్శించాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. పిల్లలు, తల్లులు, బాలింతల ఆరోగ్యాన్ని పరిశీలించి ఏమైనా సమస్యలుంటే మంచి వైద్యాన్ని అందించాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధం, అక్షరాస్యత పెంపు, బాలికలు ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రోత్సహించే లక్ష్యంతో తెచ్చిన అమ్మ ఒడి, కళ్యాణమస్తు, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు ఎలా ఉపయోగపడతాయో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలు బాల్య వివాహాలను ఎలా నిరోధిస్తాయో వివరించాలన్నారు. కళ్యాణమస్తు కింద లబ్ధి పొందాలంటే వధూవరులు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్న నిబంధన అందుకే విధించామన్నారు. రాష్ట్రంలో వెనకబడ్డ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలపై ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు.

గురువారం 3 ఆగస్టు, 2023

www.samasamajam.in

సమ సమాజం



# ట్రేడింగ్ టిప్స్ పేరుతో భారీ మోసం

**పీలేర్‌లో కాల్‌సెంటర్ గుట్టురట్టు**

**ఐదుగురు సైబర్‌నేరగాళ్లను అరెస్ట్ చేసిన**

**సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీస్**





**సమ సమాజం:** షేర్ మార్కెటింగ్‌లో అధిక లాభాలు వచ్చే విధంగా టిప్స్ ఇస్తామంటూ నమ్మించి మోసాలు చేస్తున్న ఏపీకి చెందిన సైబర్‌నేరగాళ్ల ముఠాను సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబర్‌క్రైమ్స్ డీసీపీ స్నేహా మెహ్రా వివరాలను వెల్లడించారు. చిత్తూరు- అన్నమయ్య జిల్లాకు చెందిన తిప్పనగారి సాయి సరన్‌కుమార్ రెడ్డి ఇంటిగేర్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పీలేర్‌లో ఒక సంస్థను ఏర్పాటు చేశాడు. అక్కడ 38 మంది మహిళా టెలీకాలర్స్‌తో ఒక కాల్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. సెబీలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా..


ఎలాంటి అర్హత లేకున్నా తాము ట్రేడింగ్ అడ్వయిజరీ చేస్తామంటూ కాల్‌సెంటర్ నుంచి టెలీకాలర్స్ ఫోన్లు చేస్తుంటారు. ఇందులో ఫ్లోర్ మేనేజర్లుగా కొతోళ్ల మహేశ్, రెడ్డివారి హరిబాబు యాదవ్, టీమ్ లీడర్లుగా కొర్రు అజిత్, దివాకర్‌గా పనిచేస్తున్నారు. ట్రేడింగ్ చేసే వారి డేటాను సేకరిస్తున్న వీరు బాధితులను నమ్మిస్తున్నారు. ఆ తరువాత డిమాట్ ఖాతా, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి, వాటిలోని డబ్బును ఇతర ఖాతాలకు మళ్లిస్తారు. తరువాత ఫోన్ స్విచ్చాఫ్ చేస్తారు. ఈ విధంగా దేశ వ్యాప్తంగా 140 మంది నుంచి రూ. 1.08 కోట్ల వరకు ఈ ముఠా మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడయ్యిందని డీసీపీ వివరించారు. ఈ ముఠా ఎనిమిది నెలలుగా మోసానికి పాల్పడుతుందన్నారు. నమ్మకంగా కనిపించేందుకు ఒక ఫేక్ వెబ్‌సైట్‌ను కూడా ఈ ముఠా నిర్వహిస్తుంది.

**ఇలా బయటపడింది..**

నగరానికి చెందిన ఓ బాధితుడు ఈ ముఠా మాటలు నమ్మి రూ.2.6 లక్షలు మోసపోయాడు. దీంతో బాధితుడు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో పీలేర్‌లోని కాల్‌సెంటర్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇన్‌స్పెక్టర్ హరిభూషణ్ బృందం ఈ మోసానికి సంబంధించిన తీగను లాగడంతో ఈ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు నిందితులు ఐదుగురిని అరెస్ట్ చేసి. వారి వద్దనుంచి ఆరు ఫోన్లు, 31 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఏసీపీ శివమారుతీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షాత్తు కలియుగ వైకుంఠ భగవానుడు శ్రీ. వేంకటేశ్వర స్వామి తన పెళ్లికి అయ్యే ఖర్చు కుబేరుడు దగ్గర అప్పు తీసుకొని బాకీపడి రాసిచ్చిన ప్రామిసరీ నోట్ రాగి రేకు ఇప్పటికే సురక్షితం. హిందువుల ఆరాధ్య దైవం శ్రీ. వేంకటేశ్వర స్వామి తన పెళ్లి కోసం ఆకాశరాజు కుమార్తె పద్మావతి దేవి గారిని వివాహమాడుటకు పెళ్లి ఖర్చుల నిమిత్తం దేవలోకానికి అంతటికీ ధనవంతుడైన కుబేరుడు దగ్గర పెళ్లి కయ్యే ఖర్చు అప్పు చేస్తూ... రాగి రేకు పైన రాసి ఇచ్చిన ప్రామిసరీ నోటు.. ఇప్పటికీ టీ.టీ.డీ. భద్రంగా దాచింది. చాలా గొప్ప విషయం. అప్పట్లో చెక్కులు లేవు. లేకపోతే చెక్ బౌన్స్ అయ్యేటివి. అప్పు ఇచ్చే వాళ్ళు ఉండబట్టి... మనందరి బతుకులు ముందుకు సాగుతున్నాయి. చరిత్రకారులు పేర్కొన్న ప్రకారం... ఒక ఊరిలో నివాసం ఉండాలంటే ఆ... ఊరికి నీళ్లు పారే ఎరు ఉండాలి . పాడి ఆవులు... పశు సంపద. పచ్చని పంట పొలాలు. విద్య తెలిసిన పండితుడు లేక టీచరు గాని ఉండాలి. జ్ఞాన బోధ చేయడానికి.... సంస్కృతి సంప్రదాయాలు తెలియజేయడానికి... పిల్లలకు విద్యా కేంద్రం ఉండాలి. ఆవుల మంద ఉండాలి .పాలు పెరుగు వెన్న.. నెయ్యి.. మజ్జిగ సంపూర్ణంగా లభించాలి. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలంటే పాలు.. పెరుగు.. అవసరం. ఎలాంటి రసాయన ఎరువులు లేకుండా పంటలు పండించుకోవాలంటే ఆవుల.. పశువుల పేడ లేక పెండ అవసరం. అలాంటి ఊరిలో నివాసముంటే అదృష్టం. అన్నిటికంటే ముఖ్యం.. అప్పు ఇచ్చే వారు ఉండాలి. ఇంట్లో వాళ్లకు అనారోగ్యం వచ్చి మంచాన పడిపోయినా... వారి ఆరోగ్యం మెరుగుదల కోసం ....శుభ కార్యక్రమమైనా. పెళ్లి... అశుభ కార్యక్రమమైనా.. చావు.. పిల్లల పెంపకం.. వారి చదువులకయ్యే ఖర్చులు. పొలంలో పంటలు వేసుకోవాలన్నా... ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.... కాబట్టి అప్పులు చేయక తప్పదు.ఇక స్వామివారి పెళ్లికి అయిన ఖర్చు.. అప్పు గురించి మాట్లాడుకుందాం... అప్పు చేసి పెళ్లి చేసుకున్న శ్రీ. వేంకటేశ్వర స్వామి... కుబేరుడికి చెల్లించాల్సిన అప్పు తీర్చలేక.. నానా.... అవస్థలు పడ్డాడు. పెళ్లికి అయిన అప్పులు తీర్చలేక... తిరుమల కొండపైన స్వామివారు ఒంటరిగా ఆలోచన చేసేవాడు. భార్యతో ఆనంద ఐశ్వర్యాలతో గడపాల్సిన... స్వామికి అప్పులు బాధ బెడద అధికం కావడంతో... మానసిక అశాంతికి గురై నిద్రకు.. తిండికి... శారీరక సుఖానికి దూరమయ్యాడు. మానవజాతి ఉద్ధరణ కోసం పుట్టుకొచ్చాడు. మానవులు ఎన్ని కష్టాలు పడతారో అన్ని కష్టాలు స్వామి పడ్డాడు. తన భార్య పద్మావతి దేవిని రిక్వెస్ట్ చేశాడు. నువ్వు... కింద తిరుచానూరులో ఉండమని చెప్పాడు. నేను తిరుమల కొండపైనే ఉంటానని చెప్పాడు. వాళ్ళిద్దరి మధ్యన కుదిరిన ఒప్పందం





ప్రకారం అన్యోన్యంగా భార్యాభర్తలు ఒకే దగ్గర ఉండకూడని పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పులు బాధతో విడివిడిగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. స్వామివారి దర్శనార్థం తిరుమల కొండపైకి వచ్చే భక్తులు సమర్పించే కానుకలు వాటిని సమీకరించుకొని... కూడబెట్టుకొని.... కుబేరుడికి అప్పులు తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేరే వాళ్ల దగ్గర అప్పు చేస్తే అది తీర్చకపోతే మనశ్శాంతి ఉండదు. సాక్షాత్తు స్వామి నుండి నేర్చుకోవాల్సిన అంశం పెళ్లామా ......కొండపైకి వచ్చేవాళ్లంతా... నా.. వాళ్లు... నా దర్శనార్థం అనంతరం తిరిగి నీ.... గుడికి వచ్చే వాళ్లంతా నీవాళ్లు అనే వారు స్వామివారు. తన మనసులో ఉన్న మాట తెలియజేశారు. అప్పుడు పద్మావతి దేవి గారు కల్పించుకొని వచ్చేవాళ్లంతా నీ వాళ్ళు అంటివి. వారిని కొండపైన నిలువు దోపిడీ చేస్తివి. వారి దగ్గర ఉండే సొమ్ములన్నీ నీకే దానం చేస్తే... ఇంక వారి దగ్గర ఏమీ మిగిలి ఉండదు. ఒట్టిగా నన్ను చూసి పోవడానికి..... పలకరించడానికి.... వస్తారు. నా ఆశీస్సులు పొందు తారు. కానీ వారు కానుకలు ఇచ్చేది లేదు. నేను తీసుకునేది లేదు. కుబేరుడికి కట్టాల్సిన బాకీ కట్టలేము. మనిద్దరి సంసారం సుఖంగా జరగదు ఏమో.... అని తన బాధను వెళ్ళగక్కింది పద్మావతి దేవి. కలియుగ వైకుంఠ భగవానుడు అప్పులు బాధ ఆయనకే తప్పలేదు. ఇక మానవమాత్రులకు మనుషులకు అప్పు ఉండడం పెద్ద సమస్య కాదు. అందుకే దేశ ప్రధాని నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రులు దాకా అప్పుల మీద అప్పులు చేస్తూ దేశాన్ని రాష్ట్రాలను.... విదేశాలకు తాకట్టు పెట్టుచున్నారు. ఇప్పుడు దాకా చేసిన అప్పులు మూలాన 135 కోట్ల మంది భారతీయుల జనాభా .. మనిషికి తల పైన ఐదువేల రూపాయల అప్పు ఉంది. విదేశీ బ్యాంకులలో.... స్వదేశీ తలలను తాకట్టు పెట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ...ప్రైవేటు వ్యక్తులకు అమ్మేశారు.అందుకే కమ్యూనిస్టు యోధుడు.. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి గారు తాకట్టులో భారతదేశం అనే నవల రాశాడు. భగవంతుడు శ్రీ. వేంకటేశ్వర స్వామి అష్ట కష్టాలు పడుతున్న సమయంలో తెలుగు పద కవితా పితామహుడు శ్రీ. తాళ్లపాక అన్నమాచార్యులు గారు.... శ్రీ. వేంకటేశ్వర స్వామి గొప్పతనం గురించి 32 వేల పద్యాలు రచించి ఆలపించారు. అది మూడు లోకాలకు ప్రచారం అయింది. ప్రచార వాహకుడయ్యాడు. అదివో.. అల్లదివో..... శ్రీహరి వాసము అంటూ అన్నమాచార్యులు గీతాలు ఆలపించగానే... భక్తకోటి జనం ఎక్కడ శ్రీహరివాసము.... అంటూ తిరుమల కొండకు గోవిందా అనే దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో తండోప తండాలుగా అశేష భక్త జనావళి రావడం మొదలుపెట్టారు. ఆనాటి నుంచి.... ఈనాటి దాకా భక్తుల రాక నిత్యం జరుగుతూనే ఉంది. స్వామివారి ఖండ ఖండాలుగా వ్యాపించి ఉంది. స్వామివారికి భక్తితో... భక్తులు ఇచ్చిన కానుకలు అన్ని జమచేసి.. కుబేరుడికి అప్పు తిరిగి చెల్లించి రాగిరేకు ప్రామిసరీ నోటును తిరిగి తీసుకొని భద్రపరుచుకున్నారు . ఆ రోజు నుంచి ఈరోజు దాకా పద్మావతి అమ్మవారు శ్రీ. వేంకటేశ్వర స్వామి భగవంతుడు ఇద్దరు ఆనందంగా జీవిస్తున్నారు. భక్తుల కోర్కెలు తీరుస్తున్నారు .కాబట్టి అప్పు తీసుకోవడం గొప్పకాదు. తిరిగి చెల్లించాలి. తిరిగి చెల్లించే స్తోమత లేకపోతే అప్పు తీసుకోవడం మానివేయాలి. సకాలంలో అప్పులు చెల్లించకపోతే. .. అప్పులు ఇచ్చినవాళ్లు అనరాని మాటలకు.. కుంగిపోవడం ఖాయం . అప్పు ఇచ్చినవాడు వైద్యుడు. ఆ.... పిచ్చివాడు కాదు. అప్పు ఇచ్చిన వాళ్ళ రుణం పెట్టుకోరాదు. మరో జన్మలో జన్మ ఉంటే అప్పు ఇచ్చిన వారి ఇంట్లో సేవకులుగా పుట్టి.. వారి రుణం తీర్చుకోవాలని శాస్త్రాలు... పురాణాలు చెబుతున్నాయి. అలాగా.... స్వామి వారు కుబేరుడికి చెల్లించాల్సిన అప్పులు చెల్లించి రుణ విముక్తి నుంచి బయటపడ్డాడు. అప్పు తీసుకొని తిరిగి చెల్లించడంలో స్వామివారు తిరిగి చెల్లించిన విధానం చూసి నేర్చుకోవాల్సిందిగా సమాజానికి తెలియజేస్తున్నాను. ఇట్లు. ఆర్. కరుణాకర్. హైకోర్టు న్యాయవాది. ప్రశ్నించే గొంతు.

# అధికారం ముసుగులో అక్రమాలు



**స్టేషన్ మహబూబ్‌నగర్,సమ సమాజం:** అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గురించి మంత్రి, ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి, అర్హత మంత్రికి లేదన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే కాంగ్రెస్ కట్టిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద నీళ్లు వదులుతూ కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లలో ఏమిచే యలేదని ప్రగల్భాలు పలకడం అవివేకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడూ కోయిల్‌సాగర్ ద్వారా చివరి ఆయకట్టు వరకు రైతాంగానికి రెండు పంటలకు నీరందించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాకు ఏమి చేసిందో, మీరు ఏమిచేశారో చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి అబద్దాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. మంత్రిపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు లింగంనాయక్, నాయకులు సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# హామీలు నెరవేరలేదు..



ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీ నెరవేరలేదు. సీఎం కేసీఆర్ భద్రాచలానికి నిధుల మంజూరుపై చేసిన ప్రకటన ఊసే లేదు. గోదావరి వరదతో భద్రాచలంను ముంపు నుంచి తప్పించేందుకు ఏ చర్యలు తీసుకోలేదు. సీతారామ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు. మున్నేరుకు వరదలతో అనేక ఇళ్లు నీట మునిగాయి. ముందు జాగ్రత్త లేకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చింది. ఈ సమస్యలే కాక వరదలతో నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలనే విషయాన్ని ప్రస్తావిస్తా. ప్రజా సమస్యలపై ప్రభుత్వం నుంచి సమాధానాలు రాబడుతాం.

**సత్తుపల్లిని అభివృద్ధి చేశా..**

మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాటలో సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. సత్తుపల్లిలో వంద పడకలు, పెనుబల్లి, కల్లూరుల్లో 50 పడకల ఆస్పత్రులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. అలాగే నర్సింగ్ కాలేజీ ప్రారంభానికి సిద్ధమైంది. పాలిటెక్నిక్ కళాశాల కూడా అందుబాటులోకి రానుంది. పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామదీపికలు, డీఆర్‌డీఏ సిబ్బంది, గోపాలమిత్రల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా



# మద్యం టెండర్లకు రెడీ

**నల్లగొండ క్రైం,సమ సమాజం:** మద్యం దుకాణాల టెండర్లకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సిద్ధమైంది. రెండేళ్ల కాల పరిమితికి (2023-25 సంవత్సరాలకు) గాను జిల్లాలో 155 మద్యం దుకాణాలకు టెండర్లకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 4న గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. దీంట్లో భాగంగా ఈనెల 3న (గురువారం) జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ అధికారి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల అ?ధికారుల సమక్షంలో ఆయా సామాజిక వర్గాలకు రిజర్వేషన్ ప్రాతిపదికన మద్యం దుకాణాలు నిర్ధారించేందుకు డ్రా నిర్వహించనున్నారు. 155 మద్యం షాపుల్లో గౌడ్‌లకు 34, ఎస్సీ 14, ఎస్టీ 4 షాపులు మొత్తం 52 షాపులను రిజర్వేషన్ పద్దతిన ఎంపిక చేస్తారు. మిగిలిన 103 మద్యం షాపులను జనరల్ స్థానాలుగా కేటాయించారు. అయితే అన్ని షాపులకు రిజర్వేషన్ కేటగిరీలకు సంబం?ధించిన వారు టెండర్ వేయవచ్చు. డిసెంబర్ 1 నుంచి కొత్తషాపులు ప్రారంభించేందుకు టెండర్ నోటిఫికేషన్‌లు వేస్తున్నారు.

**దరఖాస్తు ఇలా..**

మద్యం దుకాణాలకు టెండర్ వేసే అభ్యర్థులు దరఖాస్తు వెంట ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, రూ.2లక్షల డీడీ, చెక్కును జతచేయాలి. డిఫాల్టర్‌లు ఆర్థికంగా దివాలా తీసినవారు టెండర్‌కు అనర్హులు, 21 సంవత్సరాల్లోపు ఉన్న వారు మద్యం టెండర్ వేయరాదు.

**గతంలో రూ.80కోట్ల ఆదాయం**

2019-21లో 155 మద్యం షాపులకు నిర్వహించిన మద్యం దుకాణాలకు జిల్లా వ్యాప్తంగా 4వేల దరఖాస్తులు అందాయి. వీటి ద్వారా రూ.80 కోట్ల పైచిలుకు ఆధాయం సమకూరింది. అత్యధింకగా తుమ్మడం గ్రామంలోని మద్యం షాపుపై 130 దరఖాస్తులు రాగా ద్వితీయ స్థానంలో దర్వేశిపురం మద్యం షాపుకు 77 దరఖాస్తులు అందాయి. ఈసారి ఎన్నికల సమయం కావడంతో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు టెండర్ దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ అధికారులు అంటున్నారు. గతం తరహాలోనే మళ్లీ తుమ్మడం, దర్వేశిపురంలో మద్యం షాపులను దక్కించుకునేందుకు అధికంగా టెండర్లు వేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నోటిఫికేషన్‌కు అంతా సిద్ధం చేశామని కలెక్టరేట్‌లో ఈనెల 3న రిజర్వేషన్ షాపులను నిర్ధారించేందుకు డ్రా ఎంపిక చేస్తామని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

# 44 కాలనీలకు విముక్తి కల్పించిన ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి.

**ఎల్బీనగర్ సమ సమాజం:** రిజిస్ట్రేషన్లపై ఆంక్షలతో ఇబ్బందిపడుతున్న ఆరు నియోజకవర్గాల్లోని 44 కాలనీలకు విముక్తి కల్పించే ఉద్దేశ్యంతో ఆంక్షలను గతంలో ఎత్తివేస్తూ జీవో 118 విడుదల చేసింది తెలంగాణ ప్రభుత్వం.దానిలో భాగంగా ఎల్బీనగర్ శాసనసభ్యులు .దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 4000 మంది లబ్ధిదారులకు రెగ్యులరైజేషన్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి,ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేషం. బొగ్గారపు దయానంద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ మల్కాజిగిరి కలెక్టర్ అమోయ్ కుమార్ జీ.హెచ్.ఎం.సీ.కమిషనర్ రోనాల్డ్ రోస్ మరియు వివిధ శాఖల అధికారులు,మాజీ కార్పొరేటర్లు, మాజీ ఛైర్మన్లు ఉద్యమకారులు,డివిజన్ల అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాళ్లు మాజీ అధ్యక్షులు సీనియర్ నాయకులు, మహిళలు కార్యకర్తలు అభిమానులు కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







# కుర్రాళ్లకు భలే ఛాన్స్

టరౌబా (ట్రినిడాడ్): వన్డే సిరీస్ నెగ్గి జోరుమీదున్న భారత్.. వెస్టిండీస్‌తో టీ20 సమరానికి సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగే తొలి టీ20లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ముఖ్యంగా ఐపీఎల్‌తో అందరి దృష్టినీ ఆకర్షించిన తెలుగు క్రికెటర్ తిలక్ వర్మతోపాటు యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇదో సువర్ణావకాశం. హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడే యువ జట్టు ప్రతిభను చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్వయంగా పరిశీలించనున్నాడు. వన్డే సిరీసలో టీమిండియా ఆటలో ఆశించినంత దూకుడు కనిపించలేదు. కోహ్లీ, రోహిత్ శర్మను పక్కనపెట్టడంతో.. టాపార్డర్‌లో యువ ఆటగాళ్లు యశస్వీ జైస్వాల్, ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్ జట్టును నడిపించనున్నారు. తన ఫేవరెట్ ఫార్మాట్‌లో సూర్యకుమార్ పరుగుల దాహం తీర్చుకోవాలనుకొంటున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్‌కు తుది జట్టులో చోటు లభించే అవకాశం ఉండగా.. మూడో వన్డేలో అదరగొట్టిన పేసర్ ముకేష్‌తో ఉమ్రాన్ బంతిని పంచుకోనున్నారు. కుల్దీప్‌కు జోడీగా చాహల్, బిష్ణోయ్‌లో ఒకరికి చాన్స్ దక్కొచ్చు. మరోవైపు విండీస్ కూడా టీ20 స్పెషలిస్ట్‌లతో పేపర్‌పై దీటైన జట్టుగానే కనిపిస్తోంది. పూరన్ చేరికతో బ్యాటింగ్ బలపడగా.. కెప్టెన్ రోవ్‌మన్ పావెల్, మేయర్స్, కింగ్, హెట్‌మయెర్ రాణిస్తే భారీస్కోర్లు నమోదయ్యే ఛాన్సుంది.

**మూడో వన్డేలో ఘన విజయం.. సిరీస్ భారత్ కైవసం**

టరౌబా (ట్రినిడాడ్): కీలకమైన వన్డే వరల్డ్ కప్‌నకు ముందు ప్రయోగాలు అవసరమా..అన్న విమర్శలకు టీమిండియా దీటుగా బదులిచ్చింది. ప్రయోగాలు కొనసాగించి మూడో వన్డేలో భారీ స్కోరు చేసిన భారత జట్టు.. వెస్టిండీస్‌ను ఏకంగా 200 పరుగులతో చిత్తుగా ఓడించింది. తద్వారా మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకుంది. 352 పరుగుల ఛేదనలో శార్దూల్ ఠాకూర్ (4/37), ముకేశ్ కుమార్ (3/30), కుల్దీప్ (2/25) దెబ్బకు విండీస్ 35.3 ఓవర్లలో 151 పరుగులకు కుప్పకూలింది. లోయరార్డర్ బ్యాటర్ మోటీ (39 నాటౌట్) టాప్ స్కోరర్. అథనజె (32), అల్జారి జోసెఫ్ (26) రాణించారు. అంతకుముందు టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 351/5 స్కోరు సాధించింది. గిల్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా, ఇషాన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యారు.

**సీల్స్ అవుట్‌పై గందరగోళం**

మూడో వన్డేలో విండీస్ చివరి బ్యాటర్ జేడెన్ సీల్స్ అవుట్‌పై గందరగోళం ఏర్పడింది. కుల్దీప్ వేసిన 35వ ఓవర్ చివరి బంతి సీల్స్ బ్యాటు అంచుని తాకి స్లిప్ ఫీల్డర్‌కు క్యాచ్‌గా వెళ్లింది. దాంతో భారత్ అప్పీల్ చేయగా ఫీల్డ్ అంపైర్ అవుటిచ్చాడు. దీనిపై సీల్స్ సమీక్షకు వెళ్లగా..అతడు ఎల్బీడబ్ల్యూ అయినట్టు టీవీ అంపైర్ తేల్చాడు. కానీ ఫీల్డ్ అంపైర్ క్యాచ్ అవుట్‌గా ప్రకటించిన నేపథ్యంలో..సీల్స్ నాటౌట్ అని మూడో అంపైర్ నిర్ణయించాడు. అప్పటికే భారత ఫీల్డర్లంతా మైదానం వీడుతుండగా..టీవీ అంపైర్ నాటౌట్ నిర్ణయాన్ని ఫీల్డ్ అంపైర్ వారికి తెలియజేశాడు. దాంతో భారత జట్టు మళ్లీ ఆటకు సిద్ధమైంది. అయితే తదుపరి ఓవర్ అంటే.. 36వ ఓవర్ మూడో బంతికే సీల్స్ బౌల్డ్ అయ్యాడు.




# కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్ దూరం.. రిస్క్ వద్దనే!



టీమిండియా స్టార్ బ్యాటర్లు కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్‌లు ఆసియా కప్‌కు దూరమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్‌సీఏ అకాడమీలో ఉన్న ఈ ఇద్దరు ఫిట్‌నెస్ నిరూపించుకునే పనిలో ఉన్నారు. అయితే ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 17 వరకు జరగనున్న ఆసియా కప్‌లో టీమిండియా తరపున వీరిద్దరు ఆడేది అనుమానంగానే ఉంది. అనుకున్నంత వేగంగా రికవరీ కాలేదని.. పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించేందుకు మరో నాలుగు వారాలు పట్టే అవకాశముందని బీసీసీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు. అయితే సోషల్ మీడియాలో మాత్రం కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్‌లు తరచూ తమ ప్రాక్టీస్ వీడియోలనూ షేర్ చేస్తున్నారు. బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నప్పటికి వారికి తగినంత విశ్రాంతి అవసరమనిపిస్తోంది. పూర్తి ఫిట్‌నెస్ సాధించకముందే వారిద్దరిని ఆసియా కప్ ఆడించలేమని.. వన్డే వరల్డ్‌కప్ దృశ్యా అంత రిస్క్ చేయలేమని.. అది జట్టుకు కీడు చేసే అవకాశముందని బీసీసీఐ పేర్కొంది. కాగా అక్టోబర్‌లో ప్రారంభం కానున్న వన్డే వరల్డ్‌కప్‌కు రాహుల్, అయ్యర్‌లు పూర్తి స్థాయిలో సన్నద్ధమయితే సెప్టెంబర్‌లో ఆసీస్‌తో జరగనున్న వన్డే సిరీస్ ఈ ఇద్దరికి కమ్‌బ్యాక్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇక కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్ గైర్హాజరీలో సూర్యకుమార్ యాదవ్, సంజూ శాంసన్‌లకు ఆసియా కప్ మంచి అవకాశమని చెప్పొచ్చు. వరల్డ్‌కప్‌కు ముందు ఆసియా కప్ జరగనుండడంతో టీమిండియా కూడా పూర్తిస్థాయి జట్టుతోనే బరిలోకి దిగనుంది. ఇక బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రాలు ప్రధాన బౌలర్లుగా వ్యవహరించే అవకాశముంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్, శ్రీలంక లాంటి బలమైన జట్లతో ఆడాల్సి ఉంది. ఇక ఆసియా కప్ హైబ్రీడ్ విధానంలో జరగనుంది. భారత్, పాకిస్తాన్, నేపాల్ ఒక గ్రూపులో.. శ్రీలంక, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌లు మరొక గ్రూపులో ఉన్నాయి. పాకిస్తాన్‌లో నాలుగు మ్యాచ్‌లు.. శ్రీలంకలో తొమ్మిది మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక టీమిండియా తమ తొలి మ్యాచ్‌ను పాకిస్తాన్‌తో సెప్టెంబర్ 2న కొలంబో వేదికగా ఆడనుంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శు భారంభం చేసిన భారత షట్లర్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు శు భారంభం చేశారు. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్‌లు మొదటి రౌండ్‌లో విజయం సాధించారు. జపాన్ ఓపెన్‌లో విఫలమైన ప్రణయ్ హాంకాంగ్‌కు చెందిన చెక్ యూను చిత్తు చేశాడు. మూడు సెట్లలో జోరుగా ఆడిన భారత షట్లర్ 21-18, 16-21, 21-15తో గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. మరో మ్యాచ్‌లో 19వ ర్యాంకర్ శ్రీకాంత్ జపాన్ ఆటగాడైన కెంటా నిషిమొటోపై 21-18, 21-7తో అవలీలగా గెలుపొందాడు. భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బోణీ కొట్టింది. ఈ ఏడాది ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోయిన ఆమె మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌కు చేరింది. 47వ ర్యాంకర్ అష్మితా చాలిహాపై 21-18, 21-13తో సింధు విజయం సాధించింది. తర్వాతి మ్యాచ్‌లో ఆమె భారత్‌కే చెందిన ఆకర్షి కష్యప్‌ను ఢీ కొట్టనుంది.



# రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

▸ వరదలకు దెబ్బతిన్న పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. ▸ యుద్ధ ప్రతిపాదికన సహాయ చర్యలు చేపట్టాలి. ▸ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శశాంక కి వినతి

**మహబూబాబాద్ సమ సమాజం:** అల్పపీడన ద్రోని నైరుతి రుతుపవనాల బలియంతో రాష్ట్రవ్యాప్తంగా గత వారం కురిసిన వర్షాల తుఫాను బీభత్సం ప్రభావం మహబూబాబాద్ జిల్లా లో ముఖ్యంగా ఏజెన్సీ గిరిజన ప్రాంతాలలో రైతులకు ప్రజలకు అపార నష్టం కలిగించింది చెరువులు కుంటలు నిండినప్పటికీ చెరువులు కుంటలు యొక్క సామర్థ్యం కాలువలు సరిగా లేకపోవడం పలుచోట్ల పంట కాలువలకు గండ్లు పడడంతో పాటు వాగులు, వంకలు పొంగి రోడ్లు ధ్వంసమయాయని వాగులు వంకలు, పొంగడంతో వరి నార్లు పంట పొలాలు పత్తి తదితర పంట చేలు నీట మునగడమే కాకుండా ఆ పొలాల్లో చేలలో చెత్తాచెదారం వండ్రు బట్టి మేట వేయడంతో పంటలు చెడిపోయి తిరిగి ఆ భూముల్లో సాగు చేసే అవకాశం కానురాక చిన్న సన్న కారు రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట నీటి పాలు కావడంతో పాలు పోలిస్థితిలో తలలు పెట్టుకుని కొట్టుమిట్టాడుతున్నారు. దాదాపు మూడు రోజులపాటు వాగులు, వంకలు, చెక్ డాములు పొంగడంతో రవాణా సంభవించి పోవడం కాకుండా పలు గ్రామాల్లో పేదలు నివసించే ఇల్లు నేలమట్టమై రోడ్డున పడి ప్రజలు బిక్కు బిక్కు మంటున్నారు. గత సంవత్సరం వరదల వర్షాల సమయాలలో అధికార యంత్రాంగం చెరువులు కుంటలు చెక్ డాంలు రోడ్లు పంట కాలవల మరుమతులు చేయవలసిన అవసరాన్ని గుర్తించి నివేదికలు తయారు. చేసుకున్న ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ ఈ సంవత్సరం సైతం గత సంవత్సరం జరిగిన తీరుగానే మళ్లీ నష్టం వాటిల్లింది. ప్రజలకు ఇచ్చిన రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడంతో హామీలు నీటి



మూటలుగానే మిగలడంతో తుఫాను వరదనీటి తాకిడికి ఈ సంవత్సరం సైతం జిల్లాల్లో జనజీవన వ్యవస్థ కుతులమైందని అధికారులు ప్రజా ప్రతినిధులు గత సంవత్సరం ఇచ్చిన హామీలు మార్చినందునే ఈ దుస్థితి నెలకొంది. ప్రస్తుతం తుఫాను వర్ష బీభత్సంకు సంబంధించి మా ప్రతినిధి వర్గం పర్యటించి పరిశీలించి గుర్తించిన మేరకు ఈ అంశాలను తక్షణమే పరిగణంలోకి తీసుకొని సత్వరమే పరిష్కరించాలని కోరుతున్నాం. ఈ క్రింది డిమాండ్లను అమలు చేయాలని కోరుతున్నాం.

1. గార్ల మండలం గార్ల రాంపురం. గ్రామాల మధ్య ప్రాణాంతకంగా మారిన చిరకాల డిమాండ్ అయినా పాకాల చెక్ డాం పై బ్రిడ్జి నిర్మాణం గావించాలి.
2. గతంలో ఇచ్చిన ప్రభుత్వ పాలకు లు ప్రజాప్రతినిధుల హామీ మేరకు బయ్యారం పెద్ద చెరువు ను మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా లేదా సీతారాం ప్రాజెక్టుతో అనుసంధాన గావించి రిజర్వాయర్ గా మార్చాలి .బయ్యారం పెద్ద చెరువు తూములు కాలువలకు యుద్ధ ప్రతిపాదకన మరమ్మతులు గావించాలి
3. జిల్లాలో ఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన పేదలందరికీ గ్రామాల వారీగా నివేదిక తెప్పించుకొని వారికి తక్షణం ఆర్థిక సహాయం ఆవాసం కల్పించాలి. వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లుకేటాయించాలి.
4. వాగులు వంకలు ఉప్పొంగి పంటలు మునిగిపోయి వరదల కారణంగా పంటలు మునిగి పోయి చెత్త ఒండ్రుపట్టి మేటవేసి పంట నష్టపోయిన రైతులను ఆదుకొని వారికి పరిహారం చెల్లించడం తోపాటు ప్రత్నియం సాగు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి .కొత్త రుణాలు మంజూరు గావిస్తూ పాత రుణాలు రద్దు చేయాలి.
5. వర్ష ఉధృతి కారణంగా కొట్టుకుపోయిన రోడ్లు గుంతలు పడి ధ్వంసమైన రోడ్లు ను వెంటనే మరమ్మతులు చేపట్టాలి
6. పంట నష్టపోయిన రైతులకు పరిహారంతో పాటు ఉచితంగా విత్తనాలు ఎరువులతో పాటు నిత్యవసరాలు అందించి ఆయా కుటుంబాలను ఆదుకోవాలి. తదితర డిమాండ్లతో ఈరోజు జిల్లా కలెక్టర్ కి కలిసి మా అఖిల భారత రైతుకుల సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గం కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు జిల్లా ప్రధాన కార్యదర్శి జి సక్రు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే బాబు కోశాధికారి ఆళ్లకుంట సాయిలు నాయకులు నున్న ఉపేందర్ జె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ఆరు కోట్ల 63 లక్షలతో భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి

**జగిత్యాల, సమ సమాజం:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 4 కోట్లతో సమీకృత మార్కెట్, 13 లక్షల తో బస్తి దవాఖాన, 25 లక్షలతో పశువైద్య దవాఖాన లకు శంకుస్థాపన, మరియు 2 కోటి రూపాయలతో సబ్ స్టేషన్, 25 లక్షల తో పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం, అనంతరం మాజీ ప్రధాని శ్రీ"శే పివి నర్సింహారావు , స్వాతంత్ర సమరయోధులు శ్రీ"శే కె.వి కేశవులు, సంగనబట్ల మాణిక్య శాస్త్రి విగ్రహాల నిర్మాణానికి బుధవారం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ అందరూ కలలు కంటున్న సమీకృత మార్కెట్ ను నిర్మాణం చేసుకొని ప్రారంభించుకోవడం జరిగిందని , ఎన్నో సంవత్సరాల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటూ వారి చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్న వారు ఇక్కడికి రావడం జరిగింది వారందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమీకృత మార్కెట్ ప్రారంభించడం మీ కన్న నాకే ఎక్కువ సంతోషాన్ని కలిగించిందని మంత్రి అన్నారు.ఇక్కడున్న పరిస్థితి వాస్తవంగా చాలా దారుణమైన పరిస్థితని మంత్రి అన్నారు.





# మురుగుతో కంపు కొడుతున్న... ప్రివిలేజ్ డ్రైనేజీ చెరువు

**మురుగు వాసనతో కూడిన డ్రైనేజీ పారుతుంటే మీరు ఎక్కడ?**

**ప్రజల చేత ఓట్లు వేసుకున్న పాలకవర్గమా మీరు ఎక్కడ?**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లమస మధు డిమాండ్..**

**బోడుప్పల్ ఆగస్టు 2 సమ సమాజం:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల ఒకటి, మూడవ డివిజన్ల మధ్యలో నలిగిపోతున్న ప్రి విలేజ్ కాలనీ. బోడుప్పల్ బంగారు మైసమ్మ దేవాలయం నుండి చెంగిచెర్ల కు వెళ్లే దారి ప్రి విలేజ్ కాలనీ మెయిన్ రోడ్డులో చెంగిచెర్ల, బొల్లిగూడెం పై నుండి మురుగు వాసనతో వస్తున్నటువంటి డ్రైనేజ్ వాటర్ మొత్తం మూడో డివిజన్ ప్రీ రిలీజ్ లో కొన్ని సంవత్సరాల నుంచి ఒక కంపు వాసనతో డ్రైనేజీ చెరువు లాగా తయారైందని, ఉదయం నుండి సాయంత్రం వరకు వాకర్స్, ప్రయాణికులు, వాహనదారులు, చుట్టుపక్కల కాలని వాసులు డ్రైనేజీ మురుగునీరు కంపు వాసనతో కుక్కలు, పందులు కొలహలంతో అనారోగ్యం బారిన పడుతున్న చుట్టుపక్కల కాలనీవాసులు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లమస మధు మాట్లాడుతూ. చెంగిచెర్ల పరిధిలోని ప్రివిలేజ్ మొత్తం కంపు వాసనతో తయారైందని కనీసం పట్టించుకున్న నాధుడు కరువ య్యారని ఎద్దేవా చేశారు. ఊరి మీది డ్రైనేజ్ వాటర్ మొత్తం కొన్ని సంవత్సరాల తరబడి ఇక్కడ స్టోర్ అయిందని, కనీసం ఇక్కడి నుండి ఔట్ ఫుట్ లేదని, కొన్ని సంవత్సరాల తరబడి ఇక్కడే ఉంటున్నటువంటి ఈ కంపు వాసనతో చుట్టుపక్కల కాలనీవాసులు, పాదచారులు, వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారని, అనారోగ్యం పాలవుతున్నారని తెలియజేశారు. కాబట్టి వెంటనే మేయర్, కమిషనర్, జిల్లా కలెక్టర్, మంత్రి తదితరులు డ్రైనేజ్ మురుగునీటికి ఒక పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోడుప్పల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in